
ఈ వారం కథ

టి. వెంకటేష్

# చీడకాటు



కరెంటు మోటార్ విష్ణుచక్రంలా గిర్రున తిరుగుతోంది.

గలగలమంటూ గంగమ్మ తల్లి ఉరకలు వేస్తూ వస్తోంది.

కాలువ వెంట పరుగులు తీస్తున్న జలధార – పాలిపోయిన పైరు బుగ్గలపై నిగ్గును తెస్తోంది.

తుమ్మచెట్టు నీడన ముంగాళ్ళపై కూర్చుని ఉన్నాడు లచ్చిగాడు.

తడుస్తోన్న తన చేనుని తదేకంగా చూస్తున్నాడు. తృప్తి నిండిన వాడి కళ్ళల్లో పంచరంగుల స్వప్నం.

'పంట గడప కాడ్కివొచ్చి ఎన్రోజులైందో! నిరుడు కోత కొచ్చినాక పెద్ద వానలు పడి పంటంతా నీల్లపాలాయె. అంతకు మునుపు అగ్గితెగులు. దానికి ముందున తాలుయిత్తనాల బాగోతం.

ఇపుడు – మొకలేసినాక వానదేవునికి కొంచెమైనా కనికెరం ల్యాకపాయె. యాడా నల్లమోడం జాడల్యాక మొలకలెండిపోతాంటే, ఆపద మొక్కులోడిలక్క పెదకామందు ఆదుకున్నాడు. తన బాయిలోని నీల్లను వాడుకొమ్మని పంపుసెట్టునూ ఇచ్చినాడు. ల్యాకుంటే ఈసారి కూడా అంతే! అదొర పున్నెమాని పంట సేతికొస్తే, బిర్రుసేస్తోన్న అల్లునికి మిగులు కట్నం ఇచ్చేసి, అప్పులు తీర్చి... ఏ అప్పులని తీరుస్తావ్?' అంతరాత్మ హేళన చేయడంతో గతుక్కుమన్నాడు.

అంతవరకు రొద చేస్తూ తిరుగుతోన్న మోటార్ – హఠాత్తుగా మూగవోయింది. వస్తోన్న నీరూ ఆగిపోయింది. వాడి పగటి కలలాగా. భ్రమల ముసుగులోంచి ఒక్కసారిగా తేరుకుని – మోటార్ కేసి చూసి ఉలిక్కిపడ్డాడు.

సుళ్ళు తిరుగుతూ మోటార్‌లోంచి తెల్లని పొగ. ఏదో వైరు కాలుతోన్న వాసన. లచ్చిగాడి ముక్కుపుటాలకు గుప్పున సోకింది. వెంటనే పరుగెత్తి స్విచ్ ఆఫ్ చేశాడు. ఒక్కో అడుగు బలహీనంగా వేస్తూ మోటార్ వద్దకు వచ్చాడు. గుండెలో దడ. ముఖమంతా చెమటలు కమ్మేశాయి. మోటార్‌పై చేతిని పెట్టబోయి ఎందుకో రక్కున ఆగిపోయాడు. మనసులో ఏదో అనుమానం. ఎక్కడో తీతువుపిట్ట అరిచింది. లచ్చిగాడి భయం రెట్టింపయింది. కనుచూపు మేరలో గొర్రెలను కాస్తోన్న హనుమంతుగాని పాటలు... వింటూనే వాడికి కాస్త ధైర్యమొచ్చింది. ఐనా వణుకుతోన్న చేతిని మోటార్‌పై మెల్లగా ఉంచాడు.

అంతే... నక్షత్రాలు కళ్ళకు కనిపించాయి. వంట్లో రక్తానికి బదులు కరెంటు ప్రవహిస్తున్నట్టు, మెరుపు తీగెలా కంపించాడు. ఒక్క ఊపును చేతిని వెనక్కి లాగేసుకుని – ఊపిరి తీసుకున్నాడు. శరీరం అచేతన మయినట్టు కాసేపటి వరకూ మనిషి కాలేకపోయాడు. వాడి కళ్ళకు మోటార్ ఒక భూతంలా కనిపించింది. వెంటనే అక్కడి నుండి కాళ్ళకు బుద్ధి చెప్పాడు.

★ ★ ★

లంకంత మేడ. అందులో చిన్న బల్బు భళ్ళున పగిలింది. వెంటనే జోగులుగాని గూబా పగిలింది.

'సేయి జారిందయా' చెంపను నిమురుకుంటూ కంట తడిపెట్టాడు.

'జారుతుందిరా. ఈ నడుమ ఒల్లు బాగా కొవ్వెక్కింది. జీతంలో దీని డబ్బులు పట్టుకుంటే అప్పుడు తెలుస్తాది' విసురుగా వరండాలోకి వచ్చి – దబ్బున మడత కుర్చీలో వాలాడు. కిర్రుమని బాధతో మూలిగిందది.

గతుకుల ముఖం. బుర్ర మీసాలు. నల్లని ఒళ్ళు. ఒంటిపై బంగారం. తెల్లని బట్టల్లో కుదేసిన నిండు బస్తాలా ఉన్నాడు. అతని పేరు మీసాల ముత్యాలయ్య.

అల్లంత దూరంలో బర్రెల పాలు పిండుతూ క్యాన్‌లకు హడావిడిగా పోస్తున్నారు పాలేర్లు. కాళ్ళకడ్డొస్తున్న పిల్లలను తప్పించుకుంటూ కంప చెట్ల కింద కోళ్ళు చెత్తను గెలుకుతున్నాయి. ఏపుగా పెరిగిన చింతచెట్టు నీడలో పిల్లలు బిల్లంగోడు ఆడుకుంటున్నారు. అందులో కాస్త పెద్దవాళ్ళుగా ఉన్న ఇద్దరు పిల్లలు దేనికో తగువుకు దిగారు. చివరకు చొక్కాలు పట్టుకుని బలాబలాలు తేల్చుకుంటున్నారు. చుట్టూ చేరిన అల్లరి మూక చప్పట్లూ, ఈలలూ వేస్తూ వారిని మరింత ఉద్రేకపరుస్తూ ఆనందిస్తున్నారు. ఈ తతంగమంతా వినోదంగా వీక్షిస్తోన్న ముత్యాలయ్య ముందు హఠాత్తుగా వాలాడు లచ్చిగాడు.

మెడలో సొట్టలు పడ్డ ఆంజనేయుని బిళ్ళ. పెరిగిన గడ్డం. మాసిన బట్టల్లో ఎండు చేపలా ఉన్నాడు.

'ఏరా లచ్చిగా సేను తడపడం ఐందా?' చుట్టను వెలిగిస్తూ ప్రశ్నించాడు ముత్యాలయ్య.

'... నిన్నేరా. అంత బొసపెడ్తున్నావేం? ఏమైందసలు?' ముఖం చిట్లిస్తూ మరోసారి రెట్టించి ప్రశ్నించాడు.

పైన ఎండ మాడ్చేస్తోంది. కింద బండలూ మాడిపోతున్నాయి. ఐనా చెదురుమదురుగా నిల్చుని అవస్థలు పడుతూ – 'అయ్యా అది... అది...' అని నసిగాడు.

'తొందరగా చెప్పెహె! అవతల పంచాయితి ఆపీసు కాడ్కి పోవాల' విసుక్కున్నాడు ముత్యాలయ్య.

కోపం, అసహనం రెండూ ధ్వనించిన ముత్యాలయ్య కరుకు గొంతునకు ఈసారి లచ్చిగాడి నోటి తాళం ఊడింది.

అంతే విసురుగా ముత్యాలయ్య నోట్లోని చుట్ట కూడా నేలను తాకింది.

'దొంగ నా కొడకా. ఎంత పని సేసావురా! మోటార్ కాల గొట్టొచ్చి అది సెప్పడానికి నన్నింతసేపు ఇసిగిస్తావా? ఎంత దైరంరా నీకు' ఆగ్రహంతో కళ్ళెర్ర చేశాడు.

ముత్యాలయ్య గట్టిగట్టిగా బూతులు అరవడం విని – బుంగలతో వెడుతోన్న ఇద్దరూ ఇటు వచ్చారు. గేదెల చాటు నుంచి పాలేర్ల తలలూ తొంగి చూశాయి. పిల్లలందరూ గుమిగూడారు.

'ఎల్లు. ఎంటనే ఎలక్టీషన్ని ఎంటేస్కురా. మోటారును బాగు సేయించు' రంకేశాడు.

తుపానులోంచి బయటపడ్డ జాలరిలా సన్నగా కంపిస్తూ అక్కడి నుంచి తప్పుకున్నాడు. దారిపొడవునా తల రాతను నిందించుకుంటూ ఎలక్ట్రీషియన్ ఇంటి తలుపు తట్టాడు. అతగాడు టౌనెళ్ళాడని తెలిసి ఉసూరుమన్నాడు. ఎవరో పక్కూరి ఎలక్ట్రీషియన్ అడ్రసును ఇస్తే ఉరుకుల పరుగులతో వెళ్ళి వెంటబెట్టుకొచ్చాడు.

★ ★ ★

ఎలక్ట్రీషియన్ మోటార్‌ను చెక్ చేస్తున్నాడు. అతని ప్రతి కదలికను కన్నార్పకుండా చూస్తోన్న లచ్చిగాడిలో టెన్షన్. మోటార్‌కే ప్రమాదం జరిగి ఉండకూడదని మనసులో దేవుళ్ళను ప్రార్థిస్తున్నాడు. వాడి మొర ఏ దేవుడు ఆలకించన ట్టుగా, ఎలక్ట్రీషియన్ చావు కబురు చల్లగా చెప్పాడు. మోటార్ వైండింగ్ పూర్తిగా కాలిపోయిందని. ఆ మాట వింటూనే లచ్చిగాడి ముఖం మాడిన బల్బయింది.

ఇంతలో ముత్యాలయ్య వచ్చాడు. నల్లగా మాడిపో యిన మోటార్ వైండింగ్ వెక్కిరించింది. గిర్రున లచ్చిగాడి కేసి తిరిగాడు. ఒదిగిపోయి నిల్చున్నవాడు – ముత్యాలయ్య చూపులోని దావాగ్నిని భరించలేనట్టుగా మరింత కుంచించుకు పోయాడు.

'ఒరే, అయ్యో పాపమంటే అర్నెల్ల కర్మ ఎంటాడినట్టు బీదోడవని కనికరం సూపిస్తే అసలుకే ఎసరు తీస్కొచ్చినావే. నా సేనుకు నీల్లు ఎట్టుకోకుండా నీకిచ్చాను. సాయం సేసినం దుకు మాబాగా బుద్ధి సెప్పావు. మొన్ననే సంకరాతిరి నాడు దండిగ కర్సుసేసి బాగసెయిస్తే, ఇంతలోకే మల్లా రిపేరా! ఇంగ నాసాత కాదు. నువ్వే ఆ పని సూడు' అని తల పట్టుకున్నాడు.

పిడుగులా గర్జిస్తూ, పూనకం వచ్చినవాడిలా చిందులు తొక్కే ముత్యాలయ్య – మెత్తగా మందలించడం చూసి – అసలు మర్మం తెలియని జనాలు అవాక్కయ్యారు.

'ఇదిగో ఎలక్ట్రీషనూ పొద్దుమూకుతోంది, అట్లా సోద్యం సూస్తూ ఉండకపోతే, మోటార్ రిపేరీకి ఎంతయితాదో వాడికి సెప్పకూడదూ' ఎలక్ట్రీషియన్ని కదిపాడు ముత్యాలయ్య.

'అయ్యా ఇది టెన్‌హెచ్చేపి మోటర్. బాగానే ఖర్చౌ స్తుంది. 'స్టార్టర్' ఫెయిల్ అయినందువల్ల మోటర్ కాలిపో యింది. కాబట్టి స్టార్టర్ కూడా కొత్తది కొనాలి. అన్ని ఖర్చులు కలిపి షుమారుగా ఐదువేల రూపాయలు అవు తాయి' వేళ్లపై లెక్కలేశాడు ఎలక్ట్రీషియన్.

'ఐదు ఎయిలు...' తల్చుకోగానే లచ్చిగాడి గుండెలో డైనమెట్లు పేలాయి. బలంగా ముఖాన్ని కెరటమొచ్చి గుద్ది వెళ్ళినట్టు ముత్యాలయ్య ముందు కుప్పకూలాడు.

'అయ్యయ్యా మీ కాళ్ళట్టుకుంటాను. ఈ బక్కోని సంగతి తమరికి తెల్వనిదేముంది. పూట గడ్డడమే సానా ఇబ్బందిగా వుంటే, పులిమీద పుట్రలా ఇదొటి. ఎలాగోలా తమరే కాపాడాలా' జాలిగా అర్థించాడు.

'బాగుందిరోయ్ నీయవ్వారం. కనికెరం సూడబట్టే మొదటికే మోసం తెచ్చావు. మోటర్ నీ పంచలో కాలిపో యింది. దాన్ని బాగు సేయించే బాధ్యత కూడా నీదే. నేనొక్క పైసా ఇయ్యను. ఏమి తిప్పలు పడతావో ఏమో! నాకు మాత్రం ఎంటనే మోటర్ బాగైపోవాల. ల్యాకుంటే ఉన్న ఆ కొంచెం బూమిని లాక్కుంటాను. అపుడు ఎవడడ్డం వస్తాడో సూస్తా' అంటూ తీక్షణంగా చుట్టూ చూశాడు.

ముత్యాలయ్య అంత ఖండితంగా శాసించేసరికి లచ్చిగాడు నీరుగారిపోయాడు. ఐనా ఆశ చావక ముత్యాలయ్య కాళ్ళను మరింత గట్టిగా పెనవేసుకుని 'పోని అప్పుగా ఇచ్చినా ఆదుకొండయ్యా. నిదానంగా తమరి బాకీ అణాపైసలతో తీర్చేస్తాను' దుఃఖజీరతో బ్రతిమాలాడు.

పెళ్ళున నవ్వాడు ముత్యాలయ్య ఆ మాటలకు. 'ఒరే అప్పుల ఊబిలో ఇప్పటికే పీకల లోతుకు కూర్కపోయావు. దరిద్రం ఎంటాడుతోన్న నీకు అప్పిచ్చే దేవడ్రా పిచ్చోడా' అంటూ ఎగతాళిచేసి లచ్చిగాడిని ఒక్కతోపు తోశాడు.

ఎండు పుల్లలా జనాల ముందుకొచ్చి పడ్డాడు లచ్చిగాడు. కుండపోతగా సానుభూతిని కురిపిస్తోన్న వారికేసి దీనంగా – మీరైనా చెప్పి ఆదుకోండని రెండు చేతులనూ జోడించాడు. వాడి వేడుకోలులోని ఆవేదన, అభ్యర్థన తమను కాదన్నట్టు ఒక్కొక్కరే మెల్లగా జారుకున్నారు. అందరూ కనుమరుగైన వైపే చూస్తూ – ముఖాన్ని బాధగా రెండు చేతుల్లో దాచుకున్నాడు లచ్చిగాడు.

అప్పు కోసం అడ్డమైన వాళ్ళ కాళ్ళూ గడ్డాలూ పట్టుకున్నాడు ఏ గుండె ద్రవించలేదు. ఏ దేవుడూ కరుణించలేదు. చివరకు భారంగా ఇంటివైపు నడిచాడు.

అల్లంత దూరంలోంచే మామ రాకను పోల్చుకుంది బతుకమ్మ. వాలిపోయిన తోటకూర కాడలా తన మామ... ఆమె మనసు విలవిల్లాడింది. వద్దకు వచ్చాక ఆ బాధను కాస్తా పైకి వెళ్ళగక్కింది.

'ఆయాలే సెప్పా కదయ్యా మోటర్‌ను తీస్కోమాక, ఆడు అసలే మంచోడు కాదని. ఐనా నా మాట ఇనలా. దేవుడన్నావు. నెత్తిమీద ఎట్టుకుని కొల్సాలన్నావు. సూడు ఇప్పుడే మయిందో. కొంచెం కూడా కనికెరం సూపకుండా బారమంతా నీ మీదే ఏశాడు. ఎప్పటికైనా మనలాంటోల్లు వానదే వున్నే నమ్ముకోవాలా. ల్యాకుంటే మాడిసావాలా' అంటూ ఉక్రోషంతో సంటోడ్ని అన్నగబట్టి ముక్కును శుభ్రం చేసింది.

భార్య కంఠశోషకు మోకాళ్ళపై తలఅన్ని కూర్చొన్న లచ్చిగాడు ఏమీ అనలేకపోయాడు. గత్యంతరం లేక తన చెవిపోగును భార్య వంటిపైని నామమాత్రపు బంగారాన్ని అమ్మి మోటర్‌ను బతికించాడు.

★ ★ ★

రిపేరీ చేయించిన మోటర్‌ను బిగిస్తున్నాడు ఎలక్ట్రీషియన్. ఎదురుగా వారం రోజులుగా నీళ్ళులేక ఎండిపోతోన్న తన చేను. కూలి భరించలేక తన భార్యా పిల్లలూ చెమటోడ్చి శ్రమించిన చేను అది. దాన్ని చూస్తోంటే గుండెను పిడికిల్లో వేసి పిండుతోన్నట్టుగా విలవిల్లాడాడు లచ్చిగాడు.

'ఒరే లచ్చిగా సాటోడివని సాయం సేద్దామనుకున్నాను. ఇప్పుడైనా మించిపోయిందేముందిలే. ముందు నా సేను సంగతి సూసాక కావాలిస్తే నీ సేను సూద్దాం. ముందా మోటర్‌ను ఇక్కడికెల్లి బిగించవయ్యా ఎలక్ట్రీషనూ' జారిన కండువాను భుజంపైకి వేసుకుంటూ అన్నాడు ముత్యాలయ్య.

గుండె జల్లుమంది లచ్చిగాడికి. 'ఇప్పుడుగాని నీలెట్టకపోతే పంటసేతికి రాదు. మల్లీ మోటర్‌కు ఏమన్నా ఐతే...! నీవు సరిగ్గా రిపేరీ సేయించక రాలేదని నెత్తిపై రుద్దితే...! మల్లీ రిపేరీ సేయించాల్సి వస్తే...' లచ్చిగాడి భయాలతో తనకు పనిలేనట్టు ఎలక్ట్రీషియన్ మోటర్‌ను ఆడించి వెళ్ళి యాడు. లచ్చిగాడూ నిర్లిప్తంగా నాలుగడుగులు వేశాడు.

ఇంతలో పాత ఎలక్ట్రీషియన్ ఎదురుపడ్డాడు. 'ఏం ముత్యాలయ్య మామా. మోటర్ కాలిపోయిందని కబురొట్టా వట కదా! అప్పుడే చెప్పా కద మామా. 'స్టార్టర్' పనైపో యింది. వెంటనే కొత్తది మార్చు. లేకుంటే ఎక్కువ కరెంటొచ్చి మోటరే కాలిపోతుందని' వస్తూనే గడగడ మాట్లాడబోయాడు.

తలవంచుకుని నడుస్తోన్న లచ్చిగాడు – తన ఊరి ఎలక్ట్రీషియన్ మాటలకు ఉలిక్కిపడి – చివ్వున వెనక్కు చూశాడు.

అప్పటికే ముత్యాలయ్య కనుసైగ నందుకున్న ఎలక్ట్రీషియన్ ఠక్కున నోరు మూసుకున్నాడు.

అడగక ముందే సాయమందించిన ముత్యాలయ్య అసలు ఆంతర్యం అర్థమయ్యేసరికి, లచ్చిగాడి కళ్ళు బైర్లు కమ్మాయి. నిస్సహాయంగా ముత్యాలయ్య వైపే చూస్తూ దబ్బున నేలకూలాడు.

★

